క్లుప్తంగా

ఎంపీడీఓగా కె.శివపార్వతి బాధ్యత స్వీకారం



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎంపీడీవోగా కె.శివపార్వతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా రేపల్లె ఎంపీడీవోగా పనిచేస్తున్న శివపార్వతిని ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ ఉన్న తాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె స్థానిక కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో డి.రామకోటయ్య శివపార్వతికి ఛార్జి అప్పగించారు. ఎంపీడీవోను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కలిసి అభినందనలు తెలిపారు.

గణిత ఉపాధ్యాయునికి నివాళి



కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా పని చేస్తూ అనారోగ్య కారణంతో మృతి చెందిన కొలిశెట్టి వెంకట సాంబశివరావు సంతాప సభ పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటు అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన వెంకట సాంబశివరావు ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె.విజయ్ భాస్కర్, హెచ్ఎం బి.సత్యం పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని

ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా




ప్రత్తిపాడు: ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని కలుగుతుందని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని నడింపాలెంలో వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వినియోగం వలన ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని సూచిస్తూ దుకాణదారులకు నోటీసులు అందజేశారు. ఖాజా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఇంచార్జి సర్పంచ్ పాలెపు కుమారి, మహిళా పోలీస్ ఎం.నాగలక్ష్మీ, విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు



గుంటూరు రూరల్: ఇటీవల బుడమేరు వరదలతో ఇబ్బందులకు గురైన బాధితులకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు ప్రభుత్వ ఛాతీ, సంక్రమిక వ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు తెలిపారు. గోరంట్లలోని సేఫ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో పీడ్మై నేషన్ సహకారంతో విజయవాడ సింగ్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ హెల్త్‌కేర్ సెంటర్‌లో వరద బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బెల్లం, ఐదు రకాల కూరగాయలతో కూడిన కిట్‌లను అందించే వాహనాన్ని సూపరింటెండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో న్యూట్రిషన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోడిరెక్క కోటిరత్నం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ స్వాధీనం



పొన్నూరు: బాపట్ల నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని బుధవారం పొన్నూరు రూరల్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాలు.. బాపట్ల నుంచి రేషన్ బియ్యం అక్రమంగా లారీలో తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మండలంలోని చింతలపూడిలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లారీలో సుమారు 800కు పైగా రేషన్ బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మాధవి

ప్రత్తిపాడు: పిల్లల పెరుగుదలను తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పాత మల్లాయపాలెంలో లోప పోషణతో ఉన్న చిన్నారుల గృహాలను సందర్శించారు. పోషకాహారం నుంచి బయట పడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లులకు వివరించారు. బిడ్డకు ఆరు నెలలు నిండిన వెంటనే పాలతో పాటు తక్కువ మోతాదులో తృణధాన్యాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు, కూరగాయలతో చేసిన అనుబంధ పోషకాహారం అందించాలన్నారు. పిల్లల్లో పెరుగుదల కుంటుపడటం, లోపపోషణను గమనించేందుకు ప్రతి నెలా ఒకటవ తేదీన అంగన్‌వాడీ కేంద్రాల్లో బిడ్డ బరువును పరిశీలించుకోవాలన్నారు. అయోడిన్ లోపం తలెత్తకుండా అయోడైజ్డ్ ఉప్పును వాడాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త స్వాతి, మహిళలు పాల్గొన్నారు.

ఆహారం విషయంలో గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

కాకుమాను: గర్భిణి సమయంలో మహిళలు ఆరోగ్య, ఆహార విషయాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ సూచించారు. పోషాకాహార మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా కాకుమాను ఎస్సీ కాలనీ–1లో బుధవారం గర్భిణులకు పోషకాహారం వలన కలిగే ఉపయోగాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణి సమయంలో మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన తల్లి, శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతి రోజూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఇంటి వద్దనే తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉన్న ఆహారం ఎలా తయారు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.



గర్భిణులకు ఆరోగ్యకరమైన ఆహారం గురించి వివరిస్తున్న సూపర్‌వైజర్



పాతమల్లాయపాలెంలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు



లాంగ్‌జంప్ చేస్తున్న బాలిక



బాలుర విభాగంలో పోటీ...



రన్నింగ్ పోటీల్లో బాలికలు

ప్రత్తిపాడు: స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న క్రీడా ఎంపికలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం యోగా, చదరంగం, జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్‌తో పాటు 100, 200, 400, 600, 800 మీటర్ల పరుగు పందెం ఎంపికలు నిర్వహించారు. ఆయా క్రీడల్లో బాలబాలికలకు, అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు జరిగాయి. నియోజకవర్గ స్థాయి టీంలను ఎంపిక చేసినట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.డేవిడ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

మీ హౌసింగ్ శాఖ డ్యూటీలు మాకెలా వేస్తారు

హౌసింగ్ ఏఈ సురేష్‌పై ఎంఈఓలు ఫైర్

ప్రత్తిపాడు: మీ హౌసింగ్ డ్యూటీలు మాకు ఎలా వేస్తారు. మాకేం పనీ పాట లేకుండా ఉన్నామా..? అంటూ మండల విద్యాశాఖ అధికారులు సీహెచ్ రమాదేవి, జి.లీలారాణి హౌసింగ్ ఏఈ సురేష్‌పై ఫైర్ అయ్యారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా అవగాహన కల్పించేందుకు మండలంలోని ఒక్కో లే అవుట్‌కు ఒక్కో మండల స్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. అందులో భాగంగా హౌసింగ్ అధికారులు ఎంఈఓ–1, ఎంఈఓ–2 ఇద్దరినీ రెండు లేఅవుట్‌లకు స్పెషలాఫీసర్లుగా నియమించారు. దీంతో వీరికి బుధవారం మండల స్పెషలాఫీసర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం బయటకు వచ్చిన ఎంఈఓలు హౌసింగ్ ఏఈ సురేష్‌పై మండిపడ్డారు. మీ శాఖకు చెందిన డ్యూటీలు మాకెలా వేస్తారు. మా శాఖలో ఏం పనులు లేవనుకున్నారా? లేదా పనీపాట లేకుండా ఉన్నామనుకుంటున్నారా? మా విజిట్‌లు.. మా ఎండీఎంలు మాకున్నాయి.. మీ ఇష్టమొచ్చినట్లు మీరు మా పేర్లు రాసి లేఅవుట్‌కు కేటాయిస్తే ఎలాగంటూ ఏఈపై విరుచుకుపడ్డారు. మాకు మాత్రం మీ శాఖ డ్యూటీలు వెయ్యకండంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఊహించని పరిణామంతో ఏఈ సురేష్ ఖంగుతిన్నాడు. ఇది చూసిన మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది అవాక్కయ్యారు.



ప్రత్తిపాడు హౌసింగ్ ఏఈ సురేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఈఓ

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడు



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అంబటి మురళీకృష్ణ

బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: సినీ నేపథ్య గాయకుల్లో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అగ్రస్థానంలో నిలుస్తారని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సీఈఓ అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతి బుధవారం నిర్వహించారు. తొలుత బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గానగంధర్వుడు, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న బాలసుబ్రహ్మణ్యం వేలాది పాటలను పాడారన్నారు. సినీ రంగానికి ఆయన సేవలు అజరామరమన్నారు. తెలుగు భాషా పరిజ్ఞానాన్ని బాలసుబ్రహ్మణ్యం సొంతమన్నారు. ఐదు దశాబ్దాల పాటు కొనసాగిన ఆయన గాన ప్రస్థానం నిరుపమానమైందని కొనియాడారు. ఆయన్ను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ఎస్.సమీర్‌నందన్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన ఎన్ఎస్ఎస్ దినోత్సవం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి విద్యతో పాటుగా సామాజిక సేవా దృక్పథం అవసరమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చౌడవరంలోని కళాశాలలో వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విభాగాల్లోని 800 మంది విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచనం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపనం, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేశారు. 2005 సునామి, 2009 వరదలు, 2014 ఉత్తరాఖండ్ వరదలతో పాటూ పలు సందర్భాల్లో సంభవించిన అనేక విపత్తు సమయాల్లో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సహాయక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని, విద్యార్థుల సేవా కార్యక్రమాలకు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలు లభించాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎం.సుధాకర్, ఉపేంద్రచౌదరి, డి.కొండలరావు, ఎం.అనిత పాల్గొన్నారు.

ఘనంగా దీన దయాళ్ జయంతి

సుద్దపల్లి(చేబ్రోలు): చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వరికూటి సుధాకర్, జిల్లా కార్యదర్శి దానబోయిన శివయ్య పాల్గొని సేవల గురించి వివరించారు. నారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, సుభాష్‌నాయుడు, అన్నపరెడ్డి పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ

శలపాడు(చేబ్రోలు): వరిలో వచ్చే తెగుళ్లపై రైతులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి బి.శ్రీనివాస నాయక్ అన్నారు. శలపాడు, సుద్దపల్లిల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరిలో ఎరువులు, భాస్వరంను దుక్కిలో వేయాలని, యూరియా, పొటాష్‌పై పాటుగా వేయాలని చెప్పారు. భూమి ఆరోగ్యంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వేయాలని సూచించారు. ఆకుచుట్టు, పురుగు, కాండం తొలుచు పురుగును గమనించి దీని నివారణకు కెల్తన్ పిచికారి చేయాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ ఎన్.ఉష, మైలా వెంకట రామరాజు పాల్గొన్నారు.

28న హౌసింగ్ లేఅవుట్లలో అవగాహన సదస్సులు

హౌసింగ్ డీఈ టి.సత్యనారాయణ

ప్రత్తిపాడు: అన్ని గ్రామ పంచాయతీల్లోని హౌసింగ్ లే అవుట్లలో ఈనెల 28వ తేదీన లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని హౌసింగ్ డీఈ టి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు మొదలు పెట్టి, నేటికీ పూర్తికాకుండా అసంపూర్ణంగా ఉన్న లబ్ధిదారులను గుర్తించాలన్నారు. 26వ తేదీన అవుట్ స్పెషల్ ఆఫీసర్ సంబంధింత సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఫంక్షనరీ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించాలన్నారు. 27న ప్రజాప్రతినిధులకు, లబ్ధిదారులకు, అవగాహన సమావేశ వివరాలు తెలియజేయాలని, 28న హౌసింగ్ లే అవుట్‌ల వద్ద అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి ఎంత నిధులు ప్రభుత్వం చెల్లించింది, ఇంకా ఎంత చెల్లిస్తుంది.. వంటి వివరాలను వారికి పూర్తిగా తెలియజేసి మార్చి నెలాఖరుకు నిర్మాణాలు నూటికి నూరుశాతం పూర్తయ్యేలా లేఅవుట్ స్పెషలాఫీసర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సత్యనారాయణ

గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు

సమీక్ష సమావేశానికి గైర్హాజరైన లేఅవుట్ స్పెషలాఫీసర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని మండల స్పెషలాఫీసర్ జి.విజయలక్ష్మి ఇన్‌చార్జి ఎంపీడీఓ డి.రామకోటయ్యను ఆదేశించారు. నిర్మాణాల గ్రామ, మండలస్థాయి అధికారులు దృష్టి సారించి పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం ఏవో రామకోటయ్య, హౌసింగ్ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

పొన్నూరు: వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని వ్యాపార కూడళ్లలో ఆయన పర్యటించారు. వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఆర్వో వెంకటేశ్వరరావు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ..

పట్టణంలోని 20, 21 వార్డులలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సభలో మున్సిపల్ కమిషనర్ ముప్పాల రమేష్ బాబు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పఠాన్ అహ్మద్ ఖాన్, పఠాన్ ఫైరోజ్ ఖాన్, రఫీ, షేక్ బాజీ సాహెబ్, మహబూబ్ సుభాని పాల్గొన్నారు.



వ్యాపారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ రమేష్ బాబు

ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్



వివిధ పోటీలలో విజేతలతో అధ్యాపకులు



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విద్యాధర్

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం గ్రామంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని ఐపీఏ విభాగం, చలపతి పూర్వ విద్యార్థుల సంఘం, ఐఎస్‌పీఓఆర్ ఇండియా అమరావతి చాప్టర్‌ల సంయుక్తంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఫార్మసిస్ట్ డే అనేది ఫార్మసిస్టుల ముఖ్యపాత్ర, ప్రాముఖ్యతను తెలియజేస్తుందని చెప్పారు. ప్రపంచ ఔషధ సంస్థ ప్రోత్సాహంతో యావత్ ప్రపంచం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఔషధ శాస్త్రవేత్త, ఫార్మసిస్టుల పాత్రను అందరికి తెలియచెప్పే ఉద్దేశంతో ఈ ఫార్మసిస్ట్ డేను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ఉన్న గొప్పదనం, సేవా భావం అందిపుచ్చుకునేందుకు కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రొఫెసర్ రజనీకాంత్, జి.నాగరాజు పాల్గొన్నారు.

చిప్స్ కళాశాలలో..

చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఫార్మాసిస్ట్ దినోత్సవాలు బుధవారంతో ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ మాట్లాడారు. క్యాంపుల్లో సీనియర్ సిటిజన్స్, సమీప గ్రామాల ప్రజలకు ఉచితంగా వివిధ రకాల పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ విభాగం డీన్ డాక్టర్ జె.సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి సీఎస్ శ్రీనివాసు, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ, అదనపు కార్యదర్శి కె.కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శి చుక్కపల్లి రమేష్ అభినందించారు.

అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలి

కాకుమాను: అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేసి ప్రతి రైతుని, కౌలు రైతుని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన తెలిపారు. అప్పట్లో ప్రభుత్వం పంట నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరాకు రూ.పది వేలరూపాయలు నష్టపరిహారం అందిస్తామని ప్రకటించిదని కానీ నేటికి రైతులకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతు ఎకరాకు రూ.40 నుంచి 50 వేల వరకు పెట్టుబడి పెట్టారని చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతుకి ఎకరాకు రూ.25 వేల రూపాయలు నష్టపరిహారంగా ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటస్వామి పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ముద్దన వెంకటేశ్వర్లు,దొప్పలపూడి రమేష్,జంపని రామారావు,కౌలురైతు సంఘం నాయకులు చుక్కా యానాదులు,దేవరకొండ శ్రీనివాసరావు,పసుపులేటి శేషగిరిరావు,గొల్లపూడి సుబ్బారావు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

కళ్లం ఇంజినీరింగ్‌లో కోడింగ్ చాలెంజ్

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగించుకుని ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరంలోని కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న కోడింగ్ చాలెంజ్ పోటీలు కోడ్ స్ప్రింట్ 1.0 పేరుతో నిర్వహించారు. ఈ కోడింగ్ చాలెంజ్ పోటీలకు వివిధ కళాశాలల నుంచి 400 మందికి పైగా బీటెక్ విద్యార్థులు పాల్గొని మొదటి రోజు నిర్వహించిన కోడ్ ఇగ్నైట్ విభాగంలో 240 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 2వ రోజున కోడింగ్ క్లాష్ విభాగంలోకి అర్హత పొంది 120 మంది విద్యార్థులు తదుపరి ఫైనల్ ఫ్రాటియర్ విభాగంలో పాల్గొని ఆఖరిగా 3 టీం సభ్యులు 9 మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారనీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. కోడింగ్ చాలెంజ్ పోటీలను ప్రముఖ కోడింగ్ ప్లాట్‌ఫాం కోడ్ తంత్ర ఆధ్వర్యంలో నిర్వహించటం జరిగిందని ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ఈ కోడ్ స్ప్రింట్ 1.0 2024 కోడింగ్ చాలెంజ్ పోటీలకు కన్వీనర్‌లుగా డాక్టర్ పీఎల్ మాధవరావు, డాక్టర్ బి.శ్రీకాంత్, డాక్టర్ బి.బిందుమాధవి, డాక్టర్ కె.హరికృష్ణ వ్యవహరించారు.



కోడింగ్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

పారిశుద్ధ్య కార్మికులకు బకాయిలు చెల్లించాలి

పెదకాకాని: పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ కోరారు. పెదకాకాని పంచాయతీ వద్ద బుధవారం గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో టెండర్ కార్మికులకు మార్చిలో టెండర్ ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా ఇంత వరకు పంచాయతీ అధికారులు టెండర్ ప్రతిపాదనలు పంపించలేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు నూనె యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు ఇవ్వట్లేదన్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే పెండింగ్ బకాయిలు చెల్లించాలని, టెండర్ ప్రతిపాదనలు పంపి ఆర్డర్ కాపీ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈనెల 30వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.ఆదిలక్ష్మి, పాలిపోగు సుజాత, కె.రాజకుమారి, వి. భూలక్ష్మి, వై.కోటేశ్వరి, పి.మరియమ్మ, ఆర్.అనిత పాల్గొన్నారు.



వీవీఐటీ అధ్యాపకునికి డాక్టరేట్ ప్రదానం



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పచ్చల నాగబాబు మాల్వేర్ అనాలసిస్‌పై చేసిన పరిశోధనలకుగాను తమిళనాడులోని అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో బుధవారం కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌జే లక్ష్మి పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందారన్నారు. అనంతరం నాగబాబును చైర్మన్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కళావతి అభినందించారు.